18 ఏండ్లు నిండిన యువతకు ప్యాకేజీ, ప్లాట్ ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం గ్రామంలోని 18 ఏండ్లు నిండిన యువతీయువకులకు ప్యాకేజీ, ప్లాట్ ఇవ్వాలని బెల్లంపల్లి ఆర్డీఓకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ వినతిపత్రం అందించారు. సింగరేణి కేకే ఓసీపీలో ముంపుకు గురైనందున 2021 డిసెంబర్ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించారని, 2023 సంవత్సరం వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు నష్టపోతున్నారన్నారు. 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ప్యాకేజీ, ప్లాట్ వచ్చే విధంగా చూడాలని కోరారు.



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఎమ్మెల్యేగా పదవి బాధ్యతలు స్వీకరించి మొదటిసారి మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సత్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచులు శాలువ, పూలమాలతో ముందుగా సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు గుర్రం సుజాత ఆధ్వర్యంలో శాలువ వేసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సర్పంచుల పదవీ కాలం ఈ నెలతో ముగియడంతో సర్పంచుల ఫోరం అధ్యక్షులు జాడి గంగాధర్‌తో పాటు పలువురు సర్పంచులను ఎమ్మెల్యే సత్కరించారు.



అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



నవతెలంగాణ - కాసిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రొడ్డ లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించి అధికారులు ప్రగతి నివేదికను వివరించారు. తాటిగూడలో ఐకేపీ రుణాల విషయంలో సర్పంచ్ ముత్యాల స్వప్న ప్రశ్నించగా పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారు. గ్రామ సభలకు సిబ్బంది రావడం లేదని, హాజరు కావాలని సూచించారు. కోనూర్లో సమస్యలపై సర్పంచ్ అప్పని స్వరూప ప్రశ్నించారు. పత్తి కొనుగోలుకు సంబంధించి రైతులకు రావాల్సిన చెల్లింపులపై వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. ఈజీఎస్ బిల్లులు చెల్లింపులో జాప్యంపై సర్పంచ్ సపాట్ శంకర్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన సీనియర్ అసిస్టెంట్ మంచిర్యాలలో విధులు నిర్వర్తించడం సరైంది కాదని సర్పంచ్ వేముల కృష్ణ ప్రశ్నించారు. వెంటనే ఆయన మండలంలో విధులు నిర్వహించే విధంగా తీర్మానించాలని, లేకుంటే జీతం నిలిపి వేయాలని సభ్యులందరూ డిమాండ్ చేశారు. పశు వైద్య సిబ్బంది వివరాలతో సమావేశానికి హాజరు కాకపోవడంతో సిబ్బంది రావద్దని, వైద్యుడే వచ్చే విధంగా చూడాలని జడ్పీటీసీ పల్లె చంద్రయ్య పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, పార్వతి మల్లేశ్, చంద్రమౌళి, మేరుగు పద్మ, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్, సర్పంచులు దరావత్ దేవి, రాంటెంకి శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఎ అలీం, ఎంఈవో వసాల ప్రభాకర్, డీటీ మాణిక్‌రావ్, ఎంపీవో నాగరాజు, ఏవో వందన పాల్గొన్నారు.

లూయి బ్రెయిలీ సేవలు మరువలేనివి

- నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-ఆదిలాబాద్

అంధులకు లిపిని కనుగొని వారు ఉన్నతంగా జీవించడానికి మార్గదర్శకుడైన లూయి బ్రెయిలీ సేవలు మరువలేనివని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయి బ్రెయిలీ 215 జయంతి వేడుకలను టీఎన్జీఓ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారి వైపీ రమేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీని స్మరించుకుంటూ ఆయన అంధులకు చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా లిపిని కనుగొని అంధులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్రెయిలీని స్మరించుకుంటూ ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. బ్రెయిలీ అందించిన లిపి ద్వారా ఎంతో మంది ఆదర్శవంతులుగా తీర్చిదిద్దబడ్డారని పేర్కొన్నారు. ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. అనంతరం సంక్షేమ కార్యాలయ సిబ్బందితో అంధులంతా కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లాలోని అంధులు మహేష్, సుకుమార్, రవీందర్, శేఖర్, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది స్వాతి, మధుసూదన్‌రెడ్డి, సగ్గం రాజు, ఫయాజ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ- ఆదిలాబాద్అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల 2నెలల వేతనాలను వెంటనే ఇప్పించాలని కోరారు. క్లియర్‌గా లేని కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ ఈ నెలాఖరులోపు పూర్తిగా కట్టించి సంబంధించిన కార్డులను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులకు ప్రతి నెల ఇవ్వాల్సిన బెల్లం, కొబ్బరి నూనె, గ్లౌజ్‌లు, షూస్, యూనిఫామ్స్‌తో పాటు అన్ని రకాల వస్తువులు ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ప్రతి నెల 5లోపు వేతనాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తరం రాయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్టీసీ ప్రయాణం...అతివలకు సౌలభ్యం..!

- ఉచిత ప్రయాణంతో అనేక మందికి ప్రయోజనం
- రోజు 1.45లక్షల మంది జీరో టికెట్ వినియోగం
- ప్రభుత్వంపై రూ.57.53లక్షల అదనపు భారం
- ఉమ్మడి జిల్లాలో సంస్థకు పెరిగిన ఆదరణ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో మహాలక్ష్మీ పథకానికి ఆదరణ పెరుగుతోంది. రోడ్డు రవాణ సంస్థ(ఆర్టీసీ)లో మహిళల ఉచిత ప్రయాణ సౌలభ్యం కల్పించడంతో అనేక మంది వినియోగించుకుంటున్నారు. మహిళలకు ప్రభుత్వం జీరో టికెట్‌తో ప్రయాణించే సౌలభ్యం కల్పించడంతో అనేక మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజుకు 2.51లక్షల మంది ప్రయాణికుల్లో 1.45లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉండటం గమనార్హం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ సౌకర్యం కల్పించడంతో వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారికి ఎంతో ప్రయోజనకరంగా మారుతోంది. ఈ పథకం అమల్లోకి వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా..ఎలాంటి గందరగోళ పరిస్థితులు తలెత్తడం లేదు. ప్రభుత్వ నిర్ణయంతో సంస్థ పట్ల మహిళల్లో ఆదరణ పెరుగుతోంది. ఆర్టీసీలో ప్రయాణించేందుకు అనేక మంది మొగ్గుచూపుతున్నారు.

కొత్త ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం అతివలకు ప్రయోజనకరంగా మారుతోంది. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే తొలుత ఈ పథకాన్ని అమలు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో అనేక మంది వినియోగించుకుంటున్నారు. తొలి రెండు, మూడు రోజుల పాటు కొంత గందరగోళ పరిస్థితులు తలెత్తినా..అనంతరం పరిస్థితులు సర్దుకుంటున్నాయి. ప్రస్తుతం 18ఏండ్లు పైబడిన వారికి ఆధార్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు(ఒరిజినల్) ఉంటే జీరో టికెట్‌తో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తుండటంతో వీటిలో దూర ప్రాంతాలకు సైతం ప్రయాణించే వెసులుబాటు లభిస్తోంది. ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల..నిర్మల్ నుంచి ఆసిఫాబాద్ తదితర దూర ప్రాంతాలకు సైతం మహిళలు ఉచితంగానే ప్రయాణించే సౌలభ్యం కలుగుతోంది. వీటితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలంటే పల్లెవెలుగు వంటి బస్సులు చాలా ఉపయోగకరంగా మారుతున్నాయి. పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత ప్రయాణంతో ఆర్థిక భారం పడకుండా మారింది. రోజువారీగా విధి నిర్వహణ నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్తున్న ఉద్యోగులు, చిరుద్యోగులకు కూడా ప్రయోజనకరంగా మారుతోంది.

ప్రభుత్వంపై రోజు రూ.57.53లక్షల భారం..!

ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో సర్కారుపై రోజు రూ.57.53లక్షల అదనపు భారం పడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు ఉండగా వీటి పరిధిలో రోజు 2.51లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీని వియోగించుకుంటారు. ఈ లెక్కన రోజు రూ.1.28కోట్ల ఆదాయం రావాల్సి ఉంటుంది. ఇందులో మహిళలు 1.40లక్షల మంది ప్రయాణిస్తుండగా..వీరి నుంచి రోజు రూ.57.53లక్షలు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీరంతా జీరో టికెట్‌పై ప్రయాణిస్తుండటంతో ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం ఈ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక రోజుకు రూ.57.53లక్షల చొప్పున ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వం ఆదిలాబాద్ రీజియన్‌కే నెలకు రూ.17.26కోట్ల నిధులు ఆర్టీసీకి చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వానికి భారం పడుతున్నా..పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుండటం గమనార్హం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అతివలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వివిధ పనుల నిమిత్తం ప్రయివేటు వాహనాలను ఆశ్రయించడం లేదు. కొద్ది మంది తప్పితే..అధిక సంఖ్యలో మహిళలు బస్సులో ప్రయాణించేందుకే మొగ్గుచూపుతున్నారు.





ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా రోజువారీగా ప్రయాణికుల వివరాలు

డిపో	ప్రయాణికులు	వచ్చే ఆదాయం	మహిళలు	ఆదాయం
ఆదిలాబాద్	47421	2586274	23902	995592
ఆసిఫాబాద్	33740	1777687	18298	716126
భైంసా	39891	1323946	22571	794349
మంచిర్యాల	58452	3291945	32312	141006
నిర్మల్	60676	3322986	37982	1631229
ఉట్నూర్	11305	573186	5485	206468

ఉచిత ప్రయాణంతో ప్రయోజనం : సవిత, ఆదిలాబాద్

ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం చాలా ప్రయోజనకరంగా మారింది. పండగలు, వేడుకల సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లాలంటే ఇది వరకు ప్రయాణ ఖర్చుతో ఆర్థికభారం అయ్యేది. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా మేలు జరుగుతోంది. బస్సుల సంఖ్యను కూడా పెంచితే బాగుంటుంది.



నాల్గో రోజుకు రిలే నిరాహారదీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం పటాన్‌చెరు నుంచి వయా నిజామాబాద్ మీదుగా ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ ప్రతిపాదనలు పెట్టారని, దాన్ని రద్దు చేసి ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ వేయాలని రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ నారాయణ డిమాండ్ చేశారు. రైల్వేలైన్ సాధనకు ఆర్అండ్‌బి ఎదుట చేపట్టిన నిరాహర దీక్షలు శుక్రవారం నాల్గవ రోజు చేరుకున్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకోని ఆందోళనకారులతో మాట్లాడారు. అనంతరం వారు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా సాధన సమితి చైర్మెన్ నారాయణ మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం 8,9గంటల సమయం పడుతోందన్నారు. అదే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ పూర్తయితే మూడు నుంచి నాలుగు గంటల సమయంలో చేరుకోవచ్చని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ విషయంపై కృషి చేయాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశంలో ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్‌కు బడ్జెట్ కేటాయించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు శోభాతాయి తుల్జాపూరే, సిర్ర దేవేందర్, నరేందర్, భాస్కర్, గణేష్ పాల్గొన్నారు.

దీక్షలకు సుహాసినిరెడ్డి మద్దతు

దీక్షా శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణ సౌకర్యం మెరుగ్గా ఉంటే ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదిలాబాద్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రైల్వేలైన్ లేకపోవడం బాధాకరమన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్‌కు తన వంతుగా కృషి చేస్తూ ఎంపీ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా చేపడుతున్న దీక్షలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఓటు ప్రాముఖ్యత తెలిసేలా

ఓటరు దినోత్సవం నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్

ఓటు ప్రాముఖ్యత తెలిసేలా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవం రోజు ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రతిజ్ఞ, ఓటరు కార్డుల పంపిణీ, స్కూల్స్, కాలేజీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేయాలన్నారు. ముఖ్యంగా యువత, సీనియర్ సిటిజన్స్‌లకు ఓటరు దినోత్సవ ఆవశ్యకత తెలియజేయాలన్నారు. అన్ని మండల అధికారులు, జిల్లా అధికారులు, బ్యాంకింగ్ అధికారులు జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొనాలని తెలిపారు. శని, ఆది వారాల్లో ఓటరు నమోదు స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్స్, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

20,21తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే

సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ నమోదుకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, కొత్త ఓటర్ కార్డులను ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. జనవరి 20, 21 తేదీలలో ఓటరు నమోదు జాబితాలో తప్పుల సవరణకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నందున బిఎల్ఓ నుండి ప్రతి ఒక్క అధికారి అందుబాటులో ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జాతీయ ఓటరు దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పకుండా ఓటు నమోదు చేసుకునేలా చైతన్యం కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.



ఇసుక డంపుల స్వాధీనం

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని నిర్వచింతల్, కొలాంగుడ, పాతేలాపూర్ గ్రామాలలో శుక్రవారం అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. చుట్టుపక్కల వాగుల నుండి ట్రాక్టర్లలో అక్రమంగా తరలించి దాదాపు రెండు వందల ట్రాక్టర్ల ఇసుకను డంపుగా ఏర్పాటు చేశారు. దీంతో మూడు శాఖల అధికారులు దాడులు నిర్వహించి ఇసుక డంపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక డంపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో తహసీల్దార్ బౌమిక పరిమల్, ఎస్ఐ లింబాద్రి, మైన్స్ డిపార్ట్మెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమవారం సెలవు ప్రకటించాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అయోధ్యలోని రామాలయంలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం రోజు సోమవారం జిల్లాలో సెలవు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చౌహన్, వలబోజు గోపికృష్ణ అన్నారు. శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 500 సంవత్సరాల నుండి దేశ ప్రజలు రామ జన్మభూమి అయిన అయోధ్యలో రామాలయ పునర్నిర్మాణం కొరకు ఎదురుచూస్తున్న అత్యంత శుభదినమన్నారు. ఈ నెల 22న ప్రతి గ్రామంలో సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. అందుకని జిల్లాలో సెలవు ప్రకటించాలని కోరారు.

గ్రామపంచాయతీని అభివృద్ధి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం మండలంలోని మత్తడిగూడ గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీని అభివృద్ధి చేయాలనీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. ప్రతి పథకాలు నేరుగా ప్రజలకి అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడవి యశోదబాయి, గ్రామ పటేల్ సోనేరావు, మోతీరాం, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

ఆయా గ్రామ పంచాయతీలలో మొక్కల సంరక్షణ బాధ్యతలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీలలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పన్ను వసూలు చేసి, వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలో పనిచేసే లేబర్ మొబిలైజేషన్ 50కి తగ్గకుండా చూసుకోవాలన్నారు. రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు చెరువులలో ఉన్న చెట్ల తొలగించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, ఎంపీఓ జీవన్‌రెడ్డి, ఏపీఓ జగదేరావు పాల్గొన్నారు.

టీజీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

టీజీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ రాష్ట్ర చైర్‌పర్సన్ శోభ అన్నారు. శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉట్నూర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల సమాఖ్యలోని మహిళ సంఘాలకు రూ.2 కోట్ల రుణాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలందరూ ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించాలని అన్నారు. బ్యాంక్ సేవలను మరింతగా వాడుకోవాలని కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మహిళ ముద్ర లోన్స్‌ల రుణాలను పంపిణీలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామీణ మహిళల సాధికారిత కోసం నిరంతరం కృషి చేస్తున్న బ్యాంకు శాఖ సిబ్బంది ఉట్నూర్ ఐకేపీ సిబ్బంది కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ వెంకట్ రామ్‌రెడ్డి, ఉట్నూర్ బ్యాంక్ మేనేజర్ మధుసూధన్, ఐకేపీ ఏపీఎం అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల భవనం మంజూరు చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య కోరారు. శుక్రవారం పాఠశాలల విద్యా కమిషనర్ దేవసేనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో పాఠశాల తరగతి గదుల్లో నీరు చేరడంతో చదువులకు ఇబ్బందికరంగా ఉంటుందని కమిషనర్‌కు వివరించారు. వర్షాకాలంలో రైతు వేదికలో తరగతులను నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. పాఠశాల కమిషనర్ దేవసేన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. నూతన పాఠశాల భవనం మంజూరు చేసి నిర్మించాలని కోరినట్టు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితులకు జైలుశిక్ష

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరకట్న వేధింపుల కేసులో నిందితులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భార్య ఆత్మహత్య చేసుకోవటానికి కారకుడైన భర్తకు, బావకు నిర్మల్ జిల్లా ఫస్ట్ క్లాస్ న్యాయ స్థానంలో శుక్రవారం తీర్పు వెలువరించారు. మండలంలోని రాచపూర్ గ్రామానికి కుంట్ల పరమేశ్వర్, నిర్మల్ జిల్లా శాంతినగర్‌కు చెందిన కావ్యతో ప్రేమ వివాహం జరిగింది. కొద్ది నెలలు బాగానే ఉన్నారు. తర్వాత వరకట్నం కోసం శారీరకంగా మానసికంగా భర్త, బావ వేధించారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. మృతికి కారణమైన మొదటి నేరస్తుడు కుంట్ల పరమేశ్వర్(25), రెండో నేరస్తుడు మృతురాలి బావ ఉమామహేశ్వర్‌లపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా సాక్షులు చెప్పిన సాక్ష్యం కోర్టులో రుజువు కావడంతో నిర్మల్ జిల్లా ప్రధాన న్యయమూర్తి కర్ణ కుమార్ నిర్మల్ నిందితులైన కుంట్ల పరమేశ్వర్(24) కుంట్ల ఉమామహేశ్వర్(26)లకు 7 సంవత్సరాల కఠిన కారాగారా శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.3వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చినట్టు ఎస్సై తెలిపారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్టిక్కర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జైశ్రీరాం స్టిక్కర్లను శుక్రవారం ఎమ్మెల్యే పాయల శంకర్ తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 22న అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రజలు తమ ఇండ్లలో దీపాలు వెలిగించాలని అన్నారు. ఈ తరుణంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్టిక్కర్లను రూపొందించి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సూర్యకాంత్, తోట పరమేశ్వర్, మాదవ్, సుభాష్, శ్రీను, సంజీవ్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందుల్లో గిరిజనులు

- పట్టించుకోని పాలకులు



గుంతలమైయంగా మట్టిరోడ్డు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గిరిగ్రామాలకు రోడ్డు రవాణ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏండ్లుగా రోడ్డు నిర్మాణం లేక మట్టి రోడ్డుతో అనే ఇబ్బందులు పడుతున్నారు. సౌకర్యాలు లేక విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇంత జరుగుతున్న పాకులు పట్టించుకోవడం లేదు. అత్యవసరమైతే మైళ్ల దూరం కాలినడకన రావాల్సి వస్తుంది. ఎన్నికల సమయంలో గిరి గూడలకు వచ్చే ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కరంలో మాత్రం ఇటువైపు చూడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని జంబుల్‌ధరి పంచాయతీ పరిధిలోని సల్పలగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. జిల్లా కేంద్రానికి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లడానికి సరైన మార్గం లేదు. తాత్కలికంగా ఉన్న మట్టిరోడ్డుపై నుంచే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలోనైతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు ఆ దారి గుండ వెళ్లలేని స్థితి ఉంది. అయితే ఏదైన అత్యసరం అయితే మాత్రం ప్రాణాలను చేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్న నేటికి తమ గ్రామానికి మాత్రం రోడ్డు సౌకర్యం రాలేదంటున్నారు. గిరి గ్రామాలకు రోడ్డుతో పాటు వైద్య, విద్యం సౌకర్యాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదివాసులు కోరుతున్నారు.

వేడుకలకు పూర్తి భద్రత కల్పిస్తాం : డీఎస్పీ

- హిందూ సంఘాల నాయకులతో డీఎస్పీ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనవరి 22న రామమందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణంలో జరుపుకునేలా పూర్తి భద్రత కల్పిస్తామని డీఎస్పీ పోతారం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో హిందూ ధార్మిక సంఘాల సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. 21, 22 తేదిల్లో చేపట్టే కార్యక్రమాలు, ర్యాలీలు, ట్రాఫిక్, పార్కింగ్, ఆలయాల్లో పూజలు తదితర వాటి గురించి సభ్యులు తెలియజేశారు. రామ మందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని ధర్మశాల నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని, అదే విధంగా ప్రధాన ఆరు కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నట్లు పలువురు తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పండుగ వాతావరణం తలపించేలా రామ మందిర ప్రతిష్టాపనను ప్రతి హిందువు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. హిందూ సముహం పెద్దదని, ఇందులో బిన్న సంస్కృతులకు ఇది నిలయమన్నారు. కానీ శోభాయాత్రలో పాతకక్షలు బయటకు వస్తాయన్నారు. దైవ కార్యక్రమంలో ఎలాంటి తప్పులు జరగకుండా నిర్వాహకులు కూడా వారి వంతుగా భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు పూర్తి స్థాయిలో భద్రత చర్యలు తీసుకుంటారని, ముందస్తుగానే వ్యాపారులు అదే రోజు దుకాణాలను మూసి వేస్తున్నారన్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్, మహిళ పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు విష్ణువర్ధన్, కలీం, నారాయణ, హిందూ ధార్మిక సంఘాల నాయకులు కృష్ణ ఉపల్లంచివార్, ప్రమోద్ కుమార్ ఖత్రి, అధినాథ్, రాళ్లబండి మహేందర్, హన్మండ్లు, రాజేశ్వర్ కొత్తవార్, సురేందర్, శ్రీరాం శర్మ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కడెం



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దిగంబర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలను జిల్లా కమిటీ బాధ్యుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దిగంబర్ మాట్లాడుతూ కళాశాలలోని కెమిస్ట్రీ లెక్చరర్ రాజన్న, ఫిజిక్స్ లెక్చరర్ సుధాకర్‌రెడ్డిలు ప్రతిరోజు రెండు క్లాసులు మాత్రమే తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులను క్లబ్ చేసి క్లాసులు తీసుకుంటున్నందువల్ల సబ్జెక్టు తమకు సరిగ్గా అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా వీరిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే, పలుమార్లు మందలించిన వారి ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. అందుకే డీఐఈఓ పరశురాంకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేస్తున్నామని తెలిపారు. పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కంబైన్డ్ చేసి బోధించడంతో సబ్జెక్టు అర్థం కాక నష్టపోయిన విద్యార్థులకు మళ్లీ ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని లేనిచో భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఫోటో ఓటరు జాబితా కార్యక్రమం-2024పై జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఫోటో ఓటరు జాబితా కార్యక్రమం అధికారుల సమన్వయంతో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కొరకు 6, 7, 8 ఫారంల ద్వారా అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు జాబితాలో నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో నూతన ఓటరు నమోదు కొరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను పరిశీలించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీచేసి తొలగింపునకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వీసు ఓటర్ల నమోదుతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా విధులు కేటాయించేందుకు సిబ్బంది వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు.

ఇంటి స్థలాలకు పట్టాలివ్వాలి

- తుడుందెబ్బ నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని బట్టిసవర్గాం శివారులోని సర్వే నెంబర్ 72/22, లో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉన్న 2043మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలని శుక్రవారం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద ఆదివాసులకు ఇంటి స్థలాలకు జీఓ నెంబర్ 58 ప్రకారం ఇంటి పట్టాలు మంజూరు చేసి, రోడ్డు, కరెంటు, విద్య, వైద్యం తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, ఆదిలాబాద్ డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, మావల మండలాధ్యక్షులు వెడ్మ ముకుందరావు, ఆదివాసీ నాయకులు కొట్నాక్ రాంజీ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రానున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సబ్జెక్టు ఉపాధ్యాయులను డీఈఓ ఆదేశించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ మారుతి ఇటీవల హైదరాబాద్‌లో మరణించాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చి, పెద్దకర్మ కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వార్డు సభ్యులు శాంతారావు, హసన్‌ఖాన్, నాయకులు మహేందర్, అరవింద్, శంకర్, బాలాజీ, దత్తు, గణేష్, రవీందర్ ఉన్నారు.

గొంతు కోసుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యానికి బానిసైన యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని సర్వే నెంబర్ 170 కాలనీకి చెందిన మెస్రం చరణ్ భార్యతో గొడవ పడి స్థానిక ఖుర్షీద్‌నగర్ వద్ద బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చరణ్‌కు ప్రాణాపాయం లేదని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతనికి చికిత్సను అందిస్తున్నారు.

22న పట్టణంలో భారీ శోభాయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అయోధ్యలో శ్రీరామ జన్మ మందిర ప్రాణ ప్రతిష్టాపన సందర్భంగా ఈనెల 22న ఆదిలాబాద్ పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్రను చేపడుతున్నట్లు సమితి అధ్యక్షుడు రాళ్లబండి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ గోపాలకృష్ణ మఠంలో శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. శోభాయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు గంద్రత్ మహేందర్, సురేందర్, అభి, కాళ్ల సాయి ఉన్నారు.

పాఠశాలలో చిత్రలేఖనం, క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో చిత్ర లేఖన, క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.మిల్కా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న నిర్వహించనున్న బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని, పాఠశాలలలో శనివారం నుంచి ఈ నెల 24 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తునట్టు తెలిపారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తూ చిత్ర లేఖన, క్రీడా పోటీలు నిర్వహించడం జరగుతుందని పేర్కొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని టక్కుగూడ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు డోలు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న నీటి, రోడ్డు, విద్యుత్ సమస్యలను పరిష్కారిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షపాతి అని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందె విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 8 వరకు ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు, పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించిన ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారాలు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు.

పులుల సంరక్షణలో ప్రజలు సహకరించాలి

- అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ

నవతెలంగాణ-వాంకిడి

పులుల సంరక్షణలో ప్రజలు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఓ అప్పలకొండ అన్నారు. పులుల సంరక్షణకు సంబంధించి మండలంలోని రింగారిట్ గ్రామ పరిధిలోని పత్తి చేనులలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. దీనివల్ల జీవవైవిద్యం పెరుగుతుందని తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా కరెంటు లైన్లు వేయకూడదని సూచించారు. పశువులపై పులి దాడి చేస్తే అటవీ శాఖను సంప్రదించాలని, తక్షణ సహాయం కింద రూ. 5వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. పులిపట్ల ఎవరు కూడా వ్యతిరేకమైన భావనతో ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి అత్తరుద్దీన్, బీట్ అధికారి సాధిక్ పాల్గొన్నారు.

ఘనంగా దంతన్‌పెల్లి భీమయ్యక్ ఉత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తిర్యాని మండలం దంతన్‌పెల్లి భీమయ్యక్ దేవుని ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి, తిర్యాని, ఆసిఫాబాద్ జెడ్పీటీసీలు చంద్రశేఖర్, అరిగెల నాగేశ్వరరావు, ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొని పూజలు నిర్వహించారు. వేడుకలకు వచ్చిన ప్రజాప్రతినిధులకు గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గిరిజనుల ఆరాధ్య దైవమైన భీమయ్యక్ ఆలయంలో నిర్వహించే పూజల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటికి అనేక చర్యలు తీసుకున్నామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. పండగలు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని అన్నారు. ఆదివాసీల సంస్కృతి సజీవంగా ఉండడానికి ఇటువంటి పండగలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అతిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లాల, సర్పంచ్ గంగారాం, ఉపసర్పంచ్ దిలీప్, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేంజ్ పరిదిలోని చిర్రకుంట సెక్షన్‌లో శుక్రవారం ఉదయం అటవీ అధికారులు అక్రమ కలప పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భవానినగర్ నుండి టాటా ఇండికా విస్టా(టీఎస్08 యుబి3974) వాహనంలో అక్రమంగా కలప తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో సెక్షన్ అధికారి సాయి చరణ్ తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో 12 కలప దుంగలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ. 50వేలు ఉంటుంది. కలప అక్రమంగా రవాణ చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఈ తనిఖీల్లో బీటు అధికారులు ఎం.శ్రీనివాస్, రాజేష్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు : ఎస్పీ సురేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వన్య ప్రాణుల కోసం వేటగాళ్ళు పంట పొలాలు, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కే. సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దొంగతనంగా విద్యుత్ తీగలు అమర్చడం కారణంగా జంతువులు, మనుషుల ప్రమాదాలకు దారితీస్తున్నాయని, ఇటీవల సిర్పూర్ మండల పరిదిలోని చప్రి గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు అటవీ జంతువుల వేటకు కరెంట్ వైర్ పెట్టడంతో ఒక వ్యక్తి చనిపోయాడని, అతని మరణానికి కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఇలాంటి చర్యలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని, వన్యప్రాణులకు హానికలిగిస్తే మాత్రం చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

ఈ నెల 22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అయోధ్యలో 22న శ్రీ రామ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో విద్యార్థులకు శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపనను లైవ్‌లో వీక్షించే విధంగా ప్రతి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా భావితరాలకు శ్రీరాముని గొప్పతనాన్ని నడవడికను తెలియజేయల్సిన బాధ్యతగా భావిస్తూ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రెగ్యులర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థుల రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండు, నాలుగు, ఆరవ సెమిస్టర్‌లకు సంబంధించిన తరగతుల షెడ్యూల్ గురువారం విడుదల చేసినట్టు తెలిపారు. జనవరి 19 నుండి మే 16 వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. జూన్ 1 నుండి సెమిస్టర్ పరీక్షలు ఉంటాయన్నారు. రెగ్యులర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు విధిగా తరగతులకు హాజరుకావాలని సూచించారు.

'పల్లె వెలుగొ'చ్చింది..!

- దహెగాంకు వచ్చిన ఆర్‌టీసీ బస్సు
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-దహెగాం

ఇన్నాళ్లు బస్సు లేక ప్రయాణం కష్టంగా మారిన ఆ పల్లెకు వెలుగొచ్చింది. ఇక నుంచి ప్రయాణ కష్టలు దూరం కానున్నాయి. మండల కేంద్రంగా ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని నోచుకొని దీనస్థితిపై నవతెలంగాణకథనం ప్రచురించింది. స్పందించిన ఆర్టీసీ అధికారులు దహెగాంకు బస్సు నడిపిస్తూ నిర్ణయం తీసుకోవడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. మండల కేంద్రానికి కాగజ్‌నగర్ పట్టణం నుండి ఆర్‌టీసీ బస్సు రావడంలేదని, దీంతో 30 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదంటూ నవతెలంగాణలో ఈనెల 8న 'భారంగా మారిన ఉచిత ప్రయాణం' 'మహిళలకు దరిచేరని మహాలక్ష్మి పథకం అనే శీర్షిక రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో శుక్రవారం ఆసిఫాబాద్ డిపో నుంచి ఆర్‌టీసీ బస్సును వయా కాగజ్‌నగర్ మీదుగా మండల కేంద్రానికి వచ్చింది. దీంతో స్థానిక ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాపర్తి ధనుంజయ దంపతులు ప్రత్యేక పూజలు చేసి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణ ప్రాంతానికి దహెగాం మండలం నుండి ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదని, అలాగే మహిళలకు ప్రభుత్వం అందించే ఉచిత ప్రయాణం అందాలనే సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు ప్రత్యేక చొరవ చూపించి సర్వీసును ప్రారంభించినట్టు పేర్కొన్నారు. దీంతో మండలవాసులకు రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన బస్సు సర్వీసు పునరుద్ధరణ జరగడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాపర్తి రమేష్, పుప్పాల సత్యనారాయణ, పుల్గం నారాయణ, సురేష్‌గౌడ్, సంజీవ్, సురేష్, బాబాజీ, లక్ష్మీనారాయణ, మల్లేష్, ప్రదీప్, గురిజాల రాజాబాబు, దెబ్బటి సత్యనారాయణ, సుమిత్ పాల్గొన్నారు.



మండల కేంద్రంలో బస్సుకు పూజలు చేస్తున్న ఎంపీటీసీ



భారంగా మారిన ఉచిత ప్రయాణం

నవతెలంగాణలో వచ్చిన కథనం

ఆయా రాజేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. త్రివేణి



సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయాగా పని చేస్తూ శుక్రవారం అనారోగ్యంతో మరణించిన రాజేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి డిమాండ్ చేశారు. ఆయా మరణం వార్తను జిల్లా అధికారి సావిత్రి, సీడీపీఓ సురేఖలకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదన్నారు. జీఓ ఎంఎస్ 11 ప్రకారం తక్షణమే రూ. 10 వేలు చెల్లించాల్సి ఉన్నా తమకు సంబంధం లేనట్టుగా వ్యవహరించారని ఆరోపించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు కాగజ్‌నగర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. పోరాడి సాధించుకున్న జీఓను అమలు చేయకపోతే ఊరుకునేది లేదని, తక్షణమే మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించేంత వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. చివరికి సీడీపీఓ సురేఖ వచ్చి మట్టి ఖర్చుల కింద రూ. పదివేల చెల్లించారు. ఇన్సూరెన్స్ ప్రభుత్వం నుండి రాగానే ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ధర్నా విరమించారు. అనంతరం టీచర్లు, ఆయాల వంతుగా మరో రూ. 5015 ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు వినోద, వై. అరుణ, రమాదేవి, మైమున, సంగీత, కుమారి, రజిత, లక్ష్మి, సులోచన పాల్గొన్నారు.

షీటీమ్ మరింత చురుగ్గా పనిచేయాలి

- ఎస్పీ కె. సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో షీటీం కార్యకలాపాలు ఎంతో బాగున్నాయని వీటిని మరింత అభివృద్ధి పరిచి చురుగ్గ పనిచేయాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం షీటీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో నిత్యం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆకతాయిలు, పోకిరీలకు అడ్డుకట్ట వేయడమే ముఖ్య ఉద్దేశంగా పని చేయాలన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీం పనితీరు మెరుగు పడుతుందని, మరింత రక్షణగా షీటీమ్ పనిచేయాలని ఆదేశించారు. మహిళలపై దాడులు, వేధింపులు, ఆడపిల్లల పట్ల ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేందుకు షీటీమ్స్ పనితీరు మెరుగుపడుతుందనీ తెలిపారు. విద్యార్థినులను వేధించేవారిని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే పోకిరీల పట్ల చర్యలు తీసుకోవాలన్నారు. ఈవ్ టీజర్లను వారి తల్లిదండ్రులను సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం, మళ్లీ పట్టుబడితే కేసును నమోదు చేయడం బాధ్యతలని గుర్తు చేశారు. జిల్లాలో మరిన్ని షి టీమ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి, కేసులు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాపై మరింత అవగాన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌ల షీ టీం ఇన్‌చార్జులు శ్రీనివాస్, సునీత, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.



షీటీం ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న ఎస్పీ సురేష్ కుమార్



ఉద్యోగోన్నతి పొందిన పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ సురేష్ కుమార్

ఉద్యోగోన్నతి పొందిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

ఉద్యోగోన్నతి పొందిన పోలీసు సిబ్బంది బాధ్యత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ కే.సురేష్ కుమార్ సూచించారు. జిల్లాలో ఇటీవల ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించి పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు ప్రతి ఒక్కరు నీతి, నిజాయితీతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పనిచేసే వద్ద అందరితో కలివిడిగా ఉండి అందరిని సమన్వయం చేసుకుంటూ ఒత్తిడి లేకుండా పని చేస్తూ తోటి వారికి ఆదర్శంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యపరంగా ధృఢంగా ఉండాలని, ఒత్తిడి తట్టుకోవడానికి ప్రతీరోజు యోగా, ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర రావు, డీపీఓ ఏఓ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్ఐ పెద్దన్న పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో కొన్ని రోజుల క్రితం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొన్ని రోజులకే సాంకేతిక లోపంతో ఆధార్ నమోదు నిలిచిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే, రెవెన్యు, రేషన్ ఇతర పథకాలకు ఆధార్ తప్పనిసరిగా చేసింది. దీంతో ప్రజలు ఆధార్ కేంద్రంలో సేవలు నిలిచిపోయిన కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ ఉంటేనే ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలకు అర్హులవుతారు. సిర్పూర్ పోస్టాఫీసులో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రంలో సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో ప్రజలు కాగజ్‌నగర్, ఈజ్‌గాం వెళ్లి ఆధార్ నమోదుకు వెళ్తున్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

మరమ్మత్తులు చేయిస్తాం

- పోస్టుమాస్టర్ శ్రీనివాస్



నెల రోజుల నుండి సాంకేతిక లోపం కారణంగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ఈ విషయం తమ దృష్టిలో ఉంది. మరమ్మత్తుల కోసంపై అధికారులకు తెలియజేస్తాం. త్వరలోనే సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలు ఆదైర్యపడవద్దు.

బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలని మహిళా సాధికారిత జిల్లా సమన్వయ కర్త శారద అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ నెల 19 నుండి 24 వరకు జరిగే జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలను ప్రతి పాఠశాలలో నిర్వహించి బాలికల హక్కుల గురించి వివరించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో సంతకాల సేకరణ, వారిచేత బేటీ బచావో బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది జెండర్ స్పెషలిస్ట్ రాణి, ఫైనాన్స్ లీటరసీ సాగర్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వినేష్, ఉపాధ్యక్షురాలుగా అరుణ, కోశాధికారిగా కృష్ణ, కార్యదర్శులుగా సబ్బం, దివ్యజ్యోతిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ రంగ సమస్యలపై పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని పలువురు అభినందించారు.

నూతన ఓటరుగా నమోదు చేసుకోండి

నవతెలంగాణ-రెబ్బెన

18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు నూతన ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సమీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు రోజులుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిందని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఫారాలు నింపి ఇవ్వాలని సూచించారు.

జీపీల అభివృద్ధికి ప్రణాళికలు



నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సర్పంచులు కోరారు. శుక్రవారం మండలంలోని గోపాల్ నగర్, ద్వారకాపూర్, చౌటపల్లి గ్రామపంచాయతీలలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25కు గాను గ్రామ సభలు నిర్వహించారు. గోపాల్ నగర్‌లో సర్పంచ్ గజ్జల బక్కమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పంచాయతీ సభ్యులు, ప్రజల సమక్షంలో పలు తీర్మానాలు చేశారు. గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగం, పనులపై ప్రణాళికలు చేపట్టిన్టు కార్యదర్శి వసంత తెలిపారు. ద్వారకాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలలో పలు సామాజిక ఆర్థిక విషయాలపై ప్రణాళికలు చేపట్టినట్లు కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. గ్రామ సభకు మాసాడి శారద అధ్యక్షత వహించగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. గ్రామసభ అనంతరం ద్వారకాపూర్ పంచాయతీలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి డ్రైడే నిర్వహించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. అదే విధంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. చౌటపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ చీమల శంకర్ అధ్యక్షతన జరిగింది. పలు తీర్మాణాలు చేసినట్టు కార్యదర్శి వసంత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాసాడి శ్రీదేవిఇ, విద్యుత్, ఐసీడీఎస్, ఉపాధిహామీ, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా

నవతెలంగాణ-నస్పూర్

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను వినియోగదారులందరికీ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ లైన్లలో నష్టాలు, ప్రమాదాలు జరుగకుండా దృష్టి సారించడంతో పాటు విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ రాయితీలో భాగంగా ఎస్సీ,ఎస్టీ వినియోగదారుల కుల ధ్రువీకరణ పత్రాలను యుద్ధ ప్రాతిపదికన సేకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 100 శాతం విద్యుత్ బిల్లులను వసూలు చేసే దిశగా సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అండ్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్ రెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ సంధ్యారాణి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, ఎస్ఈ ఆర్.శేషారావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

పాలన పూర్తి చేసుకున్న పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



సోమగూడెం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవి కాలం ఈ నెలతో పూర్తి కానుండడంతో ఐదేండ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ ప్రమీలాగౌడ్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పాలకవర్గాన్ని సన్మానించి అభినందలు తెలిపారు. పాలకవర్గం మధ్య అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ ప్రమీలాగౌడ్‌ను వార్డు సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు, కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులకు శాలువాలతో సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరేపల్లి ప్రవీణ్, వార్డు సభ్యులు శైలజ, సల్మా జాడి ప్రమీలా, బత్తుల విజయ, కనవేణి రాధ, కొరికొప్పుల రమా, పెసరి రాజేశం, చిప్పకుర్తి తిరుపతి, ఉస్కమల్ల వివేక్, చీమల శ్రీనివాస్, పిండి సారయ్య, కార్యదర్శి రాజలింగు పాల్గొన్నారు.

ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఉపరితల గనిని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గౌరవ్ కాంట్రాక్ట్ కంపెనీ పని ప్రదేశాలను, జీవీఆర్ ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. సీఆర్ఆర్ కాంట్రాక్ట్ ప్రతినిధులతో మాట్లాడి నిర్దేశిత ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఉపరితల గని సాధించాల్సిన 35 లక్షల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 162 హెక్టార్ల అటవీ భూమి బదలాయింపు చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.పురుషోత్తమ రెడ్డి, గని మేనేజర్ సుధీర్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ అర్హత మినహాయింపు ఇవ్వాలి

నవతెలంగాణ-దండేపల్లి

2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ రాయాల్సిన అవసరం లేదని విద్యాశాఖ నోటిఫికేషన్‌లో స్పష్టంగా పొందుపరిచారని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొనగా ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల కొందరు ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఉపాధ్యాయులు బదిలీలు,పదోన్నతులు నిలిచిపోయాని తెలిపారు. టెట్ అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూనే ఇప్పుడు పదోన్నతులకు టెట్ కావాలని అనడం సరికాదన్నారు. టెట్ తప్పనిసరి నిబంధనను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. టెట్ లేకుండా పదోన్నతి కల్పించి నాలుగు సార్లు టెట్ రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తుందని, ఉపాధ్యాయుల్లో నెలకొన్న మానసిక క్షోభ నుండి విముక్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొత్త సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంఘర్స్ రాజేశ్వరరావు, జిల్లా నాయకులు రామ్మోహన్ రావు, బోయినీ శ్రీనివాస్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్ నాయకులు బైరి రామన్న పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-కాసిపేట

అడవుల రక్షణ అందరి బాధ్యతని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురువాపూర్ గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ, వన్య ప్రాణుల సంరక్షణ, అడవిలో అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ జంతువులు తాగు నీటి కోసం చెక్ డ్యాంలు, కుంటల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అటవీ జంతువులు దారి తప్పి గ్రామాల్లోకి వస్తే వాటికి హాని కలిగించకుండా అధికారులకు సమాచారం ఇవ్వాలని, వన్య ప్రాణుల వేటడరాదని, వన్యప్రాణులతో అడవులు మనుగడ ఉందన్నారు. వంట చెరుకు కోసం ఎడ్ల బండ్లతో కాకుండా నెత్తి మోపులు ద్వారా తీసుకచ్చుకోవాలని, అటవీని ఆనుకొని ఉన్న పంట చేన్లలో పత్తి కర్ర కాలబెట్టేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలని, అటవీలో మంటలు వ్యాపించకుండా చూడాలన్నారు. అటవీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని, నేరాల చేసి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. ఎండాకాలంలో మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సురేశ్, గ్రామ పటేల్ భీము, గ్రామస్తులు పాల్గొన్నారు.

జెండా వెంకటపూర్‌లో జీపీడీపీ గ్రామసభ

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామపంచాయతీలో జీపీడీపీ గ్రామ సభ నిర్వహించారు. మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ బి. రాహుల్ హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాలు తయారు చేయడంలో భాగంగా అవసరమైన వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మౌలిక సదుపాయాలు గత సంవత్సరం ఎస్‌పీఏలో కంప్లీట్ చేసే థీమ్ దగ్గరగా ఉన్న విషయాల్లో బడ్జెట్ కేటాయించి అవి పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెళ్తపు సునీత, లక్సెట్టిపేట ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మందమర్రి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య సమక్షంలో ఎన్నుకలు జరిగాయి. నూతన కమిటీని మండల ఇన్‌చార్జి జీడీ సారంగం, పట్టణ కన్వీనర్ చిలుముల రాజ్ కుమార్ ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షులుగా రాజర్ల సరేష్, మండల అధ్యక్షుడుగా ఆసంపల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల సుధాకర్, ఉపాధ్యక్షులుగా మెరుగు ప్రభాకర్, కార్యదర్శిగా ఆసంపల్లి అఖిల్, కోశాధికారిగా లైదల మారుతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని మండలాలకు నూతన కమిటీలను ఎన్నుకుంటున్నామని తెలిపారు. మాదిగలంతా ఐక్యంగా ఉండి వర్గీకరణను సాధించుకోవాలని కోరారు. అనంతరం మందమర్రి మండలం నూతన కమిటీలో ఎన్నికైన సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెరిక నరసయ్య, జీలకర శంకర్, అసంపల్లి అనిల్, మాడుగుల రాజకుమార్, అక్కపాక రాజకుమార్, ఆసంపల్లి కుమార్, బచ్చలి రాములు, బచ్చలి కిషోర్, గార కుమార్ నాయకులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు పిల్లలను ప్రోత్సహించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తల్లిదండ్రులు వారి పిల్లలను పోటీ పరీక్షలకు ప్రోత్సహించాలని తవక్కల్ విద్యాసంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. సెమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన నేషనల్ లెవెల్ టాలెంట్ టెస్ట్-2023లో స్థానిక అల్లూరీ సీతారామరావు నగర్ తవక్కల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మోతే శ్రీ తీర్థ జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఎమ్మెల్సీ సురభివాణి దేవి చేతుల మీదుగా ప్రావీణ్య పురస్కార్‌ను అందుకుంది. ప్రావీణ్య పురస్కార్‌లో భాగంగా వచ్చిన నగదు రూ.20 వేలను తవక్కల్ విద్యాసంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్ శుక్రవారం తీర్థకి అందజేసి వారి తల్లితండ్రులు మోతే రాజలింగు, రజితను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను పోటీ పరీక్షలకు ప్రోత్సహించాలని కోరారు. తమ పాఠశాలలోని విద్యార్థులకు విద్యతో పాటు ప్రతిభగల విద్యార్థులకు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిక్షపతి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లు, స్టిక్కర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

వాహనదారులు, పాదచారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించి తద్వారా సురక్షితమైన ప్రయాణం చేసి గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు బ్యానర్లు, గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చుని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 నుండి ఫిబ్రవరి 14 వరకు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మొబైల్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు.

నిర్ణీత గడువులోగా సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లాలో రైస్ మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిలర్లతో సీఎంఆర్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 వానాకాలం సంబంధించిన లక్ష్యాలను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సంబంధిత సీఎంఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. మిల్లులకు చేరుకొని మర పట్టించిన ధాన్యాన్ని సీఎంఆర్ డెలివరీస్ క్రింద భారత ఆహార సంస్థకు ఇవ్వాల్సిన ధాన్యాన్ని సకాలంలో అందించాలన్నారు. జిల్లాల వారిగా మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో పంపించాలన్నారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పని చేసి రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లులలో సీఎంఆర్ పెండింగ్ ఉంచితే మళ్ళీ ధాన్యం కేటాయించరాదన్నారు. అంతర్గత సమస్యలను పరిష్కరించుకొని లక్ష్యాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ లక్ష్యాల సాధనపై పరిశీలన చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా మేనేజర్ గోపాల్ అధికారులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం

ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను శాఖల సమన్వయం, ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దినోత్సవంలో "ఓటు లాంటిది ఇంకొకటి లేదు - నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా చైతన్య పరచాలన్నారు. ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక శిబిరాలుంటాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తు ఫారాలు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని, జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానంలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో వార్షిక పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి దానికి అనుగుణంగా అమలు పరచి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. గత సంవత్సర ఫలితాలను సూక్ష్మస్థాయిలో విశ్లేషణ చేసి, తక్కువ ఉత్తీర్ణత, ఫలితాల నమోదుకు గల కారణాలను విశ్లేషించుకుని పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో సిలబస్‌పై విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను గుర్తించాలన్నారు. ప్రతి వారం విద్యాశాఖ నిర్వహణపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, పూర్తి స్థాయి వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, పరీక్షల విభాగం సమన్వయ అధికారి దామోదర్ రావ్, డీసీఈబీ కార్యదర్శి బీమ్‌రావ్ జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, యశోధర, సత్యనారాయణ మూర్తి, మండలాల విద్యాధికారులు పోచయ్య, ప్రభాకర్, మహేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాధాకృష్ణమూర్తి, మండల నోడల్ అధికారులు హెలెన్ డోరోతి, చిన్నయ్య పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- గ్రామాల్లో బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలి
- ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తాం
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సర్వసభ్య సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించగా సభ్యులు పలు సమస్యలు లెవనేత్తారు. వాటి పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ఎంపీపీ ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందే విధంగా అధికారులు ముందుండాలన్నారు. గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులు సమూలంగా నిర్మించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రేండ్లగూడ సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్ సభ దృష్టికి తీసుకురాగా అటవీ అధికారులతో త్వరలో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, అధికారులు అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొంతమంది దళారులు దళిత బంధు, కల్యాణ లక్ష్మి పథకాలలో డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. లబ్దిదారులు దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి వచ్చేటప్పుడు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. గతంలో సర్వసభ్య సమావేశాలు ఎలా జరిగాయో తమకు తెలువదని కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరగాలన్నారు. కడెం ప్రాజెక్టు ప్రధాన కాలువకు ఇరువైపులా భూములు అన్యక్రంతం అవుతున్నాయని కో ఆప్షన్ సభ్యులు మనోహర్, అలీఖాన్, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్ తెలిపారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లింగయ్య పల్లె సర్పంచ్ బోర్లకుంట లావణ్య ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో సర్పంచుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు, 34 గ్రామాలు ఉన్నాయన్నారు. ఎక్కువగా గిరిజన గ్రామాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున దానిని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వానికి నివేదించి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణాని, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంఈఓ విజయ్ కుమార్, పశువైద్యాధికారి కస్తూరి శ్రీకాంత్, మండల వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి సంగీత, ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ, సూపర్‌వైజర్ పద్మ, ఎంపీటీసీ శంకరయ్య, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, సర్పంచులు దుర్గం గంగాధర్ ఆశ రాజ్, నైనాల తిరుపతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో అన్ని పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించే ఉపాధ్యాయులు ప్రయత్నం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో పీఆర్టీయూ జిల్లా నాయకులతో కలిసి ఆ సంఘం డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షల గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. దీనికోసం ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల కృషి చేస్తానని తెలిపారు. సంఘ నాయకులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా ఉపాధ్యాయ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు, పెండింగ్ మెడికల్ బిల్స్ మంజూరు అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు ఆడే ప్రకాష్, నాయకులు ఉప్రే వినేష్, మేడి లక్ష్మీనారాయణ, లక్కావత్ శంకర్, గోవింద్, చునార్కర్ చైతన్య పాల్గొన్నారు.

ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రామమందిర ప్రాణప్రతిష్ఠ ఈనెల 22న ఎలాంటి ర్యాలీలు తీవద్దని రూరల్ సీఐ సైదారావు సూచించారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 22న రామజన్మభూమి ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా ర్యాలీలు, ఇతర కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ముజాయిద్, ఆయ మతాల పెద్దలు పాల్గొన్నారు.

గోదావరి ఎఫ్‌పీఓ రైస్ స్టోర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

గోదావరి ఎఫ్‌పీఓ రైస్ స్టోర్‌లో నాణ్యమైన జైశ్రీరామ వడ్లను రైతుల నుండి సేకరించి ఎక్కువ పాలిష్ లేకుండా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి కల్తీ లేకుండా తక్కువ ధరకు బియ్యం అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో భీమారం, జైపూర్ మండలాల్లో గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన రైతుల నుండి నాణ్యమైన జైశ్రీరామ వడ్లను సేకరించడం జరిగిందని తెలిపారు. క్వింటాలుకు రూ.5 వేల 800ధరతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయించేందుకు నిర్ణయించామన్నారు. బియ్యం కావాల్సిన వారు సెల్ 9652004886, 7337488828, 9121103856 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

22న అంతర్గత ఉద్యోగులకు పరీక్షలు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, బిట్ షార్ప్‌నర్, కార్పెంటర్ డెసిగ్నేషన్‌లో అంతర్గత ఖాళీల భర్తీకి ఏరియా వర్క్ షాప్‌లో 22న ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జీఎం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్షీ, హెడ్ చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్, డంప్ మెన్, ట్రిప్స్ మెన్ ప్రాక్టికల్ రాతపరీక్షలు వృత్తి శిక్షణ కేంద్రం(ఎంవీటీసీ)లో 24న ఉ.10 గంటలకు, సర్వే మజ్దూర్ రాత పరీక్ష సింగరేణి ఉన్నత పాఠశాలలో 28న ఉ.10గంటలకు, అలాగే శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జనరల్ మజ్దూర్, హెమ్ మౌఖిక పరీక్ష, ఈపీ గ్రీజర్ హెల్పర్ ప్రాక్టికల్ పరీక్షలు 30న ఉ.10 గంటలకు జరుగుతాయన్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలన్నారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు, తొలగింపుకు శిబిరం

నవతెలంగాణ-తాండూర్

ఓటర్ల నమోదు, తొలగింపుల ప్రక్రియకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్పెషల్ కంపెన్‌ను ఈ నెల 20, 21న నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రోహిత్ ఒక ప్రకటనలలో పేర్కొన్నారు. నూతన నమోదుకు ఫారం-6, డబుల్, మరణించిన, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓటర్ తొలగింపుకు ఫారం 7, మార్పులుచేర్పులకు ఫారం-8 ద్వారా దరఖాస్తులకు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. 1 జనవరి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. గ్రామస్థాయి బూత్ స్థాయి అధికారులు ఓటర్ల నమోదు ప్రక్రియలో చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు.

24లోగా నష్టపరిహారానికి దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులు నష్టపరిహారం పొందేందుకు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ వినీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 31 మార్చి 2022 కంటే ముందు ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న వారిని నష్టపరిహారం పొందేందుకు అర్హులుగా పరిగణించబడుతారన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలు నష్టపరిహారం పొందేందుకు దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, యుఎఎన్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, మృతి కారణాన్ని నిర్ధారించే మెడికల్ సర్టిఫికెట్, ఎఫ్ఐఆర్, పంచనామా, పోస్టుమార్టం నివేదిక సమర్పించాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని 2వ అంతస్తులో ఎస్-8లో గల జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి అందజేయాలని సూచించారు.

రేపు కుమురం భీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో ఈ నెల 21 కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహన కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిష్కరణ వివరాలను తెలియజేశారు. దేవాపూర్‌లో జరిగే ఆవిష్కరణకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు జిల్లాలో సినీ, టివి, దర్శక, రచయితల శిక్షణ శిబిరం

నవతెలంగాణ-నస్పూర్

సిని, టివి రంగాలలో రాణించేల ఔత్సాహికులకు ఈనెల 20న కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. టివి దర్శకులు నాగబాల సురేష్ కుమార్ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ సి.పార్థసారథి శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు.

దేవాలయంలో శ్రమదానం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

ఈనెల 22న అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయాలను శుద్ధి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చారు. శుక్రవారం బీజేపీ నాయకులు అంగడి బజార్ హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం ఆలయంలో రామ భజన చేశారు. ప్రజలందరూ 22న పండుగ వాతావరణంలో సంబరాలు చేసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు తమ్మినేని శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొప్ప కిషన్, వేముల మధు, పట్టణ అధ్యక్షులు హరీ గోపాల్ పాల్గొన్నారు.